‘ప్రజాపాలన’ సేవా కేంద్రాలు ప్రారంభం



టేక్మాల్ : ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీపీ చింత స్వప్న రవి

నర్సాపూర్, మార్చి 4: నర్సాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కౌంటర్‌ను సోమవారం ఏర్పాటు చేసినట్లు ఎంపీవో వైద్య శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తు చేసుకోలేని లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తుల స్వీకరణకు కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించినట్లు తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు ప్రభుత్వ పథకాలు అందని ఎడల మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం

మెదక్‌రూరల్, మార్చి 4: మెదక్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఎంపీపీ చింత స్వప్న రవి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం ఉపాధ్యక్షురాలు నిమ్మవాణి రమేశ్, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు యూసూఫ్, ఎంపీడీవో రియాజోద్దిన్, తహసీల్దార్ కృష్ణ పాల్గొన్నారు.

టేక్మాల్‌లో..

టేక్మాల్, మార్చి 4: మండలంలోని ఎంపీపీ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఎంపీపీ చింత స్వప్న రవి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం ఉపాధ్యక్షురాలు నిమ్మవాణి రమేశ్, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు యూసూఫ్, ఎంపీడీవో రియాజోద్దిన్, తహసీల్దార్ కృష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- ప్రజావాణిలో 132 అర్జీలు
- అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు

ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్

అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి

మెదక్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): సమస్యల పరిష్కారానికి ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, ఇతర సమస్యల గురించి 122 మంది అర్జీలు వచ్చాయి. ఈ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌వో పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

మెదక్ అర్బన్, మార్చి 4: అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ డాక్టర్ బాలస్వామి సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించారు.

ప్రజా సంక్షేమం కోసం పని చేయాలి

మెదక్‌రూరల్, మార్చి 4: అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి అధికారులు పని చేయాలని ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. సోమవారం మెదక్ ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ యమున అధ్యక్షతన సర్వ సభ సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆంజనేయులు, మెదక్, మాచవరం పీఏసీఎస్ చైర్మన్లు హన్మంత్‌రెడ్డి, సీతారామ య్య, ఎంపీడీవో రఘు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

చిన్నశంకరంపేట, మార్చి 4: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తెలిపారు. సోమవారం మండలంలోని మిర్జాపల్లిలో నిర్వహించి మల్లన్న, ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పడాల శివరాములు, ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రోహిత్‌కు ఆహ్వాన పత్రిక

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని చిన్నశంకరంపేటలో నిర్వహించనున్న సోమేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవానికి హాజరు కావాలని కొంపల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ జీవన్ నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న మాజీ సర్పంచ్ రాజిరెడ్డి

కన్నులపండువగా మల్లన్న కల్యాణం

మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



మల్లన్న స్వామిని దర్శించుకొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి

వెల్దుర్తి, మార్చి 4: వెల్దుర్తి పంచాయతీ శేరీల గ్రామంలో మల్లన్న జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం బోనాలు, గండ దీపాలను డప్పుచప్పుళ్లు, డోలు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి దేవతామూర్తులకు సమర్పించారు. ఆలయ ఆవరణలో అగ్నిగుండాలు ఏర్పాటుచేశారు. మల్లన్న, జమదగ్నిల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై మల్లన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. యాదవ సంఘం నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌గౌడ్, గంగాధర్, శాకారం శ్రీను, వెంకటేశం, రమేశ్‌గుప్తా, కిష్టయ్య, మహేశ్, శేఖర్, పాండు రంగం, శంకర్‌రెడ్డి, మల్లేశంచారి ఉన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 4: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో (బేగంపేట్, రామంతాపూర్) ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి 1వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో ఆరుగురికి (బాలురు 3, బాలికలు 3) అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు 1 జూన్ 2017 నుంచి 31 మే 2018 లోపు జన్మించి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు కులం, ఆదాయం, నివాస, బర్త్ సర్టిఫికెట్లుతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఏడాది ఆదాయం గ్రామీణ పరిధిలో రూ.లక్ష 50 వేలు, పట్టణ పరిధిలో రూ.2 లక్షలకు మించి ఉండరాదన్నారు. దరఖాస్తులను కలెక్టరేట్‌లోని గిరిజన అభివృద్ధి కార్యాలయం నుంచి ఉచితంగా పొంది ఈనెల 11వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. 14న కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిన విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ఎంపిక చేస్తారన్నారు. వివరాలకు 8328572779లో సంప్రదించాలన్నారు.

ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పురం మహేశ్ ముదిరాజ్

మనోహరాబాద్, మార్చి 4: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని ఆపార్టీ మండల అధ్యక్షుడు పురం మహేశ్ ముదిరాజ్ అన్నారు. మండలంలోని కాళ్లకల్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ దొంగ హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి గెలిచాక రైతులు, ప్రజలకు రేవంత్ సర్కార్ మొండి చెయ్యి చూపుతున్నదన్నారు. ఆరు గ్యారెంటీలపై వారానికో మాట మారుస్తూ కాలం వెళ్లదీస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన దొంగహామీలపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రభుత్వాన్ని ఎండగట్టాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలించుకోవాలని కోరారు. సమావేశంలో పార్టీ కూచారం గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి నరేశ్ ముదిరాజ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్మాత్మిక చింతన అలవర్చుకోవాలి

పూజలో పాల్గొన్న మాధవానంద స్వామి

పాపన్నపేట, మార్చి 4: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని తొగిట పీఠాధిపతి స్వామి మాధవానంద స్వామి అన్నారు. సోమవారం మండలంలోని నాగ్‌సాన్‌పల్లి శివారులో ఉన్న సంతోషి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో అర్చకులు రాజశేఖర్ శర్మ, శ్యామ్ సుందర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

కోనాపూర్‌లో ‘బేటీ బచావో బేటీ పడావో’

రామాయంపేట రూరల్, మార్చి 4: మండలంలోని కోనాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో డిస్ట్రిక్ మిషన్ కో ఆర్డినేటర్ సంతోషి, జెండర్ స్పెషలిస్టు కవిత విద్యార్థులకు అవగాహన కల్పించారు. బేటీ బచావో బేటీ పడావో, సుకన్య సమృద్ధి యోజన, బాల్య వివాహాలు, ట్రాఫికింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పోక్సో యాక్టు గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొడుకుపై తండ్రి హత్యాయత్నం

తూప్రాన్, మార్చి 4: మరో వ్యక్తితో కలిసి కన్న కొడుకుపై తండ్రి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇస్లాంపూర్ గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన గొల్ల వంశీ (26)కి మూడేండ్ల క్రితం నిజామాబాద్ జిల్లా వర్ని మండలానికి చెందిన శిరీషతో వివాహం జరిగింది. కుటుంబ కలహాలతో కొద్దిరోజుల క్రితం శిరీష పుట్టింటికి వెళ్లిపోయింది. ఈనెల 2న శిరీష వర్ని పోలీస్‌స్టేషన్‌లో వంశీపై ఫిర్యాదు చేసింది. అదే రోజు వంశీకి తండ్రి కిష్టయ్యకు గొడవ జరిగింది. గొడవలన్నింటికీ నువ్వే కారణమని కిష్టయ్య, వంశిని దూషించాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి వంశీకి సంబంధించిన గుర్తింపు కార్డులు, బట్టలు, వస్తువులను కిష్టయ్య వాకిట్లో పడేశాడు. ఇంటి లోపల నుంచి గడియ పెట్టుకున్నాడు. డోర్ తీయమని వంశీ పిలవగా, తీయను, లోపలికి వస్తే చంపేస్తానన్నాడు. దీంతో వంశీ అక్కడే ఉన్న కర్రతో డోర్ పగలగొట్టుకుని లోపలికి ప్రవేశించాడు. అప్పటికే కత్తులు పట్టుకుని రెడీగా ఉన్న కిష్టయ్య, ట్రాక్టర్ డ్రైవర్ కొండపురం లక్ష్మణ్, వంశీపై దాడి చేశారు. దీంతో వంశీ ఎడమచేయికి తీవ్ర గాయమైంది. పక్కటెముకల్లో గాయాలయ్యాయి. వంశీ ప్రాణ భయంతో పరుగులు తీయగా, ఈరోజు చంపేస్తామని వెంబడించారు. నాలుగైదు గల్లీలు పరుగెత్తి తన స్నేహితుడు మహేశ్ ఇంటికెళ్లి జరిగిన విషయం చెప్పాడు. మహేశ్ ఈ విషయాన్ని సర్పంచ్ భర్త రమేశ్‌కు తెలుపాడు. క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం బోయిన్‌పల్లిలోని ఓ దవాఖానకు తరలించారు. వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివానందం తెలిపారు.

చలో మోదీ సభను జయప్రదం చేయాలి

మెదక్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలోని పటేల్ గూడలో మంగళవారం నిర్వహించనున్న మోదీ విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ తెలిపారు. ప్రధాని మోదీ మంగళవారం మెదక్ పార్లమెంట్‌లోని పటాన్‌చెరు నియోజకవర్గంలో పటేల్‌గూడకు విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సభకు కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, మెదక్ పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు సతీశ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వీణ పాల్గొన్నారు.

పోషకాహారాన్ని తీసుకోవాలి

చిన్నశంకరంపేట, మార్చి 4: గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి తెలిపారు. సోమవారం చిన్నశంకరంపేటలోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నాగరాణి, ఏఎన్ఎం పాల్గొన్నారు.

పాఠశాలలో లైబ్రరీ నిర్మించొద్దు

వెల్దుర్తి, మార్చి 4: వెల్దుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లైబ్రరీని నిర్మించొద్దని జడ్పీ సీఈవోకు సోమవారం నాయకులు వినతిపత్రం అందజేశారు. పాఠశాల ఆవరణను క్రీడలకు మాత్రమే వినియోగించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఎస్ఎంసీ మాజీ చైర్మన్ వెంకటేశం, నాయకులు కృష్ణాగౌడ్, గంగాధర్, శాకారం శ్రీను, శ్రావణ్, శివశంకర్ తదితరులు ఉన్నారు.

ఏడుపాయల జాతరను విజయవంతం చేద్దాం

మెదక్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): ఏడుపాయల జాతర విజయవంతం చేయాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏడుపాయల జాతరపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడుపాయల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా జాతర ఏర్పాట్లు చేయాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. 130 మంది గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్, మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో, మోటార్ సైకిల్ ఢీకొని ముగ్గురికి గాయాలు

కొల్చారం, మార్చి 4: ఎదురెదురుగా వస్తున్న ఆటో, మోటార్‌సైకిల్ ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో కిష్టాపూర్–పోతంశెట్‌పల్లి మధ్యలోని హనుమాన్ బండల్ వద్ద సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన పసుల కుమార్ వెంకటాపూర్ గ్రామానికి చెందిన సుదర్శన్ మోటార్‌సైకిల్‌పై కిష్టాపూర్ నుంచి పోతంశెట్‌పల్లి వైపు వస్తున్నారు. మార్గమధ్యలో హనుమాన్ బండల్ మూలమలుపు వద్ద ఎదురుగా ఆటోను ఢీకొట్టారు. దీంతో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన వడ్ల రంగాచారితో పాటు పసుల కుమార్ సుదర్శన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను మెదక్ జిల్లా దవాఖానకు తరలించారు.

పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యం : డీఈవో

రంగంపేట పాఠశాలలో విద్యార్థులకు ఓటరు సంకల్ప పత్రాలు అందజేస్తున్న డీఈవో రాధాకిషన్

కొల్చారం, మార్చి 4: లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు కచ్చితంగా ఓటేసేలా ‘తెలంగాణ ఓటరు సంకల్ప పత్రాలు’ అందజేస్తున్నట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా కలెక్టర్ రాజర్షి షా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడంతో మెరుగైన పోలింగ్ నమోదైందన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, హెచ్ఎం ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి పదో తరగతి కీలకం: డీఈవో

వెల్దుర్తి, మార్చి 4: ప్రతి విద్యార్థికి పదో తరగతి ఎంతో కీలకమని, భవిష్యత్‌ను మార్చే దశని డీఈవో రాధాకిషన్ అన్నారు. సోమవారం వెల్దుర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈవో సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి వార్షిక పరీక్షల సన్నద్ధతపై, తీసుకుంటున్న ప్రత్యేక తరగతులు, సాధారణ పరీక్షలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరీక్షలపై అవగాహన, సబ్జెక్టులను చదవడంపై వివరించారు. డీఈవో వెంట ఎంఈవో యాదగిరి, హెచ్ఎం సాంబయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ అనిల్ కుమార్ రెడ్డి

అల్లాదుర్గం, మార్చి 4: మండలంలో కల్యాణలక్ష్మి చెక్కులను సోమవారం తహసీల్ కార్యాలయంలో ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 92 మందికి కల్యాణలక్ష్మి, 9మందికి షాదీముబారక్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, ఎంపీటీసీ విఠల్‌రెడ్డి, నాయకులు బలరాం, మధు, పాండు తదితరులు పాల్గొన్నారు.

మొగి పురుగు నివారణకు జాగ్రత్తలు

చిలిపిచెడ్, మార్చి 4: వరి పొలాల్లో మొగి పురుగు నివారణకు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాధికారి బాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గౌతాపూర్, సోమక్కపేట గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు. సోమక్కపేట పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈవో భూపాల్, రైతులు పాల్గొన్నారు.

పాలాల రోడ్డుకు అడ్డుగా ఉన్న గోడ తొలిగింపు

వెల్దుర్తి, మార్చి 4: మాసాయిపేట మండలంలోని బొమ్మారం రైల్వే ట్రాక్‌కు అవతలి వైపు నుంచి పొలాలకు వెళ్లేందుకు మట్టి రోడ్డు ఉంది. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా పంట పొలాలకు వెళ్లే రోడ్డుకు అడ్డంగా కాంక్రిట్ గోడ నిర్మించారు. దీంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. ఎంపీటీసీ నవనీతశ్రీను ఈ విషయాన్ని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రోడ్డును పునరుద్ధరించాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం తూప్రాన్ డీఎల్‌పీవో శ్రీనివాసరావు, మాసాయిపేట తహసీల్దార్ జ్ఞానజ్యోతి ఈ గోడను తొలిగించాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. వీరివెంట ఆర్ఐ ధన్‌సింగ్, సర్వేయర్ నర్సింలు, నాయకులు స్టేషన్‌శ్రీను, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పెండింగ్ డీపలను వెంటనే చెల్లించాలి

రామాయంపేట, మార్చి 4: ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రణీద్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం రామాయంపేటలో టీఆర్‌టీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పండిత్, పీఈటీ, ఎంఈవో పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్, అసోసియేట్ అధ్యక్షులు ప్రభాకర్, డి.మోహన్, నర్సింహారావు, రసీద్, విద్యాసాగర్, రమేశ్, నవీన్ రత్నాకర్, విఠల్, శేఖర్, విరోభా పాల్గొన్నారు.

హత్యకు దారి తీసిన వివాహేతర సంబంధం

నర్సాపూర్, మార్చి 4: వివాహేతర సంబంధంతో భర్తను భార్య హత్య చేయించిన ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. సీఐ జాన్‌రెడ్డి కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల దుర్గేశ్ (28) ఫిబ్రవరి 29న నర్సాపూర్ మండలంలోని చిప్పల్‌తుర్తి అటవీ ప్రాంతంలో హత్యకు గురయ్యాడు. ఈ కేసును పోలీసులు ఛేదించి పూర్తి వివరాలు సేకరించారు. మృతుడి భార్య భార్గవి, వెల్దుర్తి మండలం మానేపల్లికి చెందిన జూల అశోక్ ఇద్దరు కలిసి 9 నెలల నుంచి పొలిటికల్ మీటింగ్స్, ఇతర ప్రైవేట్ ఈవెంట్స్‌లలో ఫోక్ సాంగ్స్, డ్యాన్స్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఇలా వారి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఇద్దరు ప్రేమించుకున్నారు. అశోక్, మృతుడి భార్య భార్గవిని స్కూటీపై పికప్, డ్రాప్ చేసేవాడు. దీంతో మృతుడు దుర్గేశ్‌కు ఇద్దరిపై అనుమానం రావడంతో భార్యను రోజూ కొట్టేవాడు. దీంతో భార్గవి, అశోక్ ఎలాగైనా దుర్గేశ్‌ను చంపాలని నిర్ణయించుకున్నారు. అశోక్ తన స్నేహితులైన అదే గ్రామానికి చెందిన గొల్ల మహేశ్, సంతోష్‌లతోపాటు నర్సాపూర్ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన మరో స్నేహితుడు పెద్దగొల్ల పర్వతాలుకు తమ ప్రేమ విషయం చెప్పి, దుర్గేశ్‌ను చంపడానికి పథకం పన్నారు. పథకం ప్రకారం ఫిబ్రవరి 29న అశోక్, పర్వతాలు, మహేశ్, సంతోష్, దుర్గేశ్‌ను కౌడిపల్లి మండలంలోని తునికి నల్ల పోచమ్మ గుడికి రప్పించి, బాగా మద్యం తాగించి స్పృహ కోల్పోయేలా చేశారు. అనంతరం దుర్గేశ్‌ను నర్సాపూర్ మండలంలోని చిప్పల్‌తుర్తి గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి సాయంత్రం టీ షర్ట్స్‌తో గొంతు నలిపి, తలపై రాయితో కొట్టి హత్య చేశారు. ఈనెల 2న నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, కౌడిపల్లి ఎస్సై రంజిత్‌కుమార్, క్రైమ్ స్టాఫ్ ఉపేందర్, శ్రీకాంత్ ఐదుగురు నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

ఐదు ద్విచక్రవాహనాలు సీజ్

చిన్నశంకరంపేట, మార్చి 4: నెంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న ఐదు బైకులను సీజ్ చేశామని చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ తెలిపారు. సోమవారం మిర్జాపల్లి చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నెంబర్ లేకుండా ఐదు ద్విచక్రవాహనాలు రావడంతో వాటిని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

నర్సాపూర్‌లో నూతన కాలనీ ప్రారంభం

నర్సాపూర్, మార్చి 4: మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో కొత్తగా మారుతి కాలనీని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సోమవారం ప్రారంభించారు. అనంతరం స్వాగత బోర్డు వద్ద ప్రత్యేక పూజలు జరిపించారు. నూతన కాలనీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు భిక్షపతి, కౌన్సిలర్లు రాంచందర్, నాయకులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు కరువు భత్యం అమలుచేయాలి

చేగుంట, మార్చి 4: బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యాన్ని ఏప్రిల్ నుంచి అమలు చేయాలని రాష్ట్ర బీడీ కామ్‌గార్ ఫెడరేషన్ సలహాదారుడు గంగాధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పు లక్ష్మణ్ పేర్కొన్నారు. సోమవారం చేగుంటలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న అన్ని కేటగిరీల బీడీ కార్మికులకు కరువు భత్యం అగ్రిమెంట్ ప్రకారం వెయ్యి బీడీలకు రూ.11.30 పైసలు పెరిగిందన్నారు. దీంతో పాటు నెలసరి ఉద్యోగులకు రూ.339, బీడీ ప్యాకింగ్ కార్మికులకూ పెరిగిన కూలి రెట్లు అమలుచేయాలని డిమాండ్ చేశారు. వారితో తుమ్మ రవీందర్, ఇస్మాయిల్, పర్శవ్వ, సిద్దయ్య తదితరులున్నారు.

దొంగతనానికి పాల్పడ్డ ఇద్దరి పట్టివేత

రామాయంపేట, మార్చి 4: దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను స్థానికులు పట్టుకున్న ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబలి కేంద్రం వద్ద సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని కేసీఆర్ కాలనీ డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లలో నివసిస్తున్న ఇద్దరు రాజాసింగ్, అజయ్‌సింగ్ ఇనుప బోర్డు దొంగిలించారు. ఈ బోర్డును విక్రయించేందుకు తీసుకొస్తుండగా స్థానికులు గొల్పర్తి రోడ్ అంబలి కేంద్రం వద్ద పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ తెలిపారు.

జీరో కరెంట్ బిల్లు అందజేత

నర్సాపూర్, మార